పచ్చిరొట్ట..భూమికి రక్ష

ఆధునిక వ్యవసాయం రైతన్నకు లాభాలు తెచ్చినా, భూమి తల్లికి మాత్రం తీరని నష్టాన్ని కలిగిస్తోంది. సంప్రదాయ సాగుతో భూసారం క్రమంగా తగ్గిపోతోంది. అధిక దిగుబడులే లక్ష్యంగా రసాయన ఎరువుల వాడకం నేల స్థితిగతులనే మారుస్తోంది. నేలల్లో చౌడు శాతాన్ని పెంచడంతో పాటు సహజ లక్షణాలను దెబ్బతీస్తోంది.వీటి వాడకాన్ని తగ్గించుకోకుంటే భవిష్యత్‌లో భారీ మూల్యం చెల్లించుకోక తప్పదు. అందుకే ప్రభుత్వం భూసారాన్ని పరిరక్షించడంపై దృష్టి సారించి పచ్చిరొట్ట పైర్ల సాగును ప్రోత్సహిస్తోంది. రైతులకు ఆర్బీకేల ద్వారా 50శాతం సబ్సిడీపై పచ్చిరొట్ట విత్తనాలను పంపిణీ చేస్తోంది.

జీలుగ పచ్చిరొట్ట పైరు



జలదంకి: గతంలో రైతులు సేంద్రియ ఎరువుల ఆధారంగా పంటలను సాగు చేసేవారు. దీంతో భూమి స్వభావం మారేది కాదు. గ్రామాల్లో పశుసంపద తగ్గడంతో భూమికి సేంద్రియ ఎరువును తగిన స్థాయిలో అందించలేకపోతున్నారు. దీనికి తోడు మారిన కాల పరిస్థితులకు అనుగుణంగా ఆధునిక వ్యసాయ పద్ధతుల వైపు రైతులు మొగ్గు చూపారు. అధిక దిగుబడులు సాధించేందుకు రసాయన ఎరువులు, పురుగు మందులను విచక్షణారహితంగా వినియోగిస్తున్నారు. దీంతో తాత్కాలికంగా అధిక దిగుబడులు వస్తున్నప్పటికీ భూమి తన సహజ సిద్ధమైన సారాన్ని కోల్పోయి నిస్సారంగా తయారవుతోంది. వీటిని సారవంతంగా మార్చేందుకు పచ్చిరొట్ట ఎరువులను సాగుచేసుకోవాలని వ్యవసాయాధికారులు సూచిస్తున్నారు. పచ్చిరొట్ట పైర్లు సాగు చేసిన పొలాల్లో పంటలను సాగు చేయడం వల్ల అన్ని రకాల పోషక విలువలు అంది దిగుబడులు గణనీయంగా పెరుగుతాయని చెబుతున్నారు. పచ్చిరొట్ట పైర్ల సాగుకు పెట్టుబడులు అవసరం లేదు. భూమికి కావాల్సిన అన్ని రకాల పోషకాలను అందివ్వడంలో జనుము, జీలగ, పిల్లిపెసర, అలసంద, తదితర పచ్చిరొట్ట పైర్లది ప్రధాన పాత్ర. ఉదయగిరి నియోజకవర్గంలోని అన్ని మండలాల్లోని రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలు రైతులకు అందుబాటులో ఉన్నాయి. ప్రభుత్వం 50శాతం సబ్సిడీపై వీటిని రైతులకు అందజేస్తోంది. వేసవిలో దుక్కులు దున్నుకుని తొలకరి వర్షాలు పడగానే పచ్చిరొట్ట విత్తనాలు చల్లుకోవాలి. విత్తనాలు పలుచగా చల్లాలి. పైరు పలుచనైతే మొక్క ఏపుగా పెరిగి పీచుతో చీకడానికి ఎక్కువ సమయం పడుతుంది. చౌడు నేలలు, వరి పండించే నేలల్లో ఎకరాకు జీలగలు 10 నుంచి 12 కిలోలు, జనుములు 12 నుంచి 14 కిలోలు, పిల్లిపెసర్లు 6 నుంచి 7 కిలోల వరకు చల్లుకోవచ్చు. పైరు మొలకెత్తిన తరువాత 40 నుంచి 50 రోజుల వ్యవధిలో పూత దశలో నేలలో కలియదున్నాలి. ఇవి నేలకు సేంద్రియ పదార్థాలతో పాటు నత్రజనిని పుష్కలంగా అందిస్తాయి. పచ్చిరొట్ట పైర్లను కలయదున్నితే వరి పంటకు రసాయన ఎరువులు వినియోగించాల్సిన అవసరం ఉండదు. రైతులకు ఎరువుల పెట్టుబడి తగ్గడంతో పాటు నేల ఉత్పాదక సామర్థ్యం కూడా పెరుగుతుంది. అలాగే నేలలో నీరు ఇంకే గుణం బాగా పెరుగుతుంది. సూక్ష్మజీవులు వృద్ధి చెంది నేల సారం పెరుగుతుంది. కలుపు కూడా పెరగకుండా నివారించవచ్చు. చౌడు భూముల పునరుద్ధరణకు పచ్చిరొట్ట ఎరువులు ఎంతో ఉపయోగపడతాయి. భాస్వరం, గంధకం వంటి పోషకాల లభ్యత గణనీయంగా పెరుగుతుంది. పశువుల మేతకు కూడా పత్యామ్నాయంగా ఇవి ఉపయోగపడుతాయి.

నియోజకవర్గానికి కేటాయించిన పచ్చిరొట్ట విత్తనాలు క్వింటాళ్లలో..

మండలం	జీలగలు	జనుములు	పిల్లిపెసర్లు
జలదంకి	190	78	68
కలిగిరి	22	116	143
కొండాపురం	41	181	203
వింజమూరు	11	23	0
ఉదయగిరి	21	26	28
వరికుంటపాడు	54	86	112
సీతారామపురం	0	36	8
దుత్తలూరు	42	67	117



రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు అందజేస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది

రాయితీపై విత్తనాలు సిద్ధం



విచ్చలవిడిగా రసాయన ఎరువుల వాడకంతో భూమి స్వభావం దెబ్బతింటుంది. పచ్చిరొట్ట పైర్లను సాగుచేసి కలయదున్నడం ద్వారా భూమి సారవంతమవుతుంది. తద్వారా రసాయన ఎరువుల వాడకాన్ని తగ్గించవచ్చు. దీంతో పంట పెట్టుబడులు తగ్గుతాయి. ప్రస్తుతం రైతు భరోసా కేంద్రాల్లో పచ్చిరొట్ట విత్తనాలైన జనుము, జీలగలు, పిల్లిపెసర్లను 50 శాతం రాయితీపై అందజేస్తున్నాం. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలి. – బీ శైలజ, ఏఓ, జలదంకి

క్లుప్తంగా

వైభవంగా పాండురంగడి రథోత్సవం



సీతారామపురం: మండలంలోని నారాయణప్పపేట సమీపాన ఉన్న పాండురంగ విఠలేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు గురువారంతో ముగిశాయి. చివరిరోజు ఉదయం స్వామివారికి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సాయంత్రం సీతారామపురం తూర్పువీధి వారు ఉభయకర్తలుగా రథోత్సవం, పార్వేట కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. భక్తులకు అన్నదానం చేశారు.

భక్తిశ్రద్ధలతో సహస్ర ఘటాభిషేకం



ఆత్మకూరు: పట్టణంలోని కాశీనాయన ఆశ్రమంలోని కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో లోకక్షేమాన్ని కాంక్షిస్తూ, వర్షాలు సకాలంలో కురవాలనే సంకల్పంతో చేపడుతున్న ఏకాదశ రుద్రాభిషేకంలో భాగంగా మూడోరోజు గురువారం సహస్ర ఘటాభిషేకాన్ని భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. భక్తులు 1008 ఘటాలతో పవిత్ర జలాలను తీసుకొచ్చి అభిషేకం చేశారు. అనంతరం విశేష ద్రవ్యాలతో ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించి మహానైవేద్యం సమర్పించారు.

నేడు మండల సర్వసభ్య సమావేశం

అల్లూరు: మండల పరిషత్ కార్యాలయంలో మండల సాధారణ సర్వసభ సమావేశాన్ని శుక్రవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ జ్యోతి గురువారం తెలిపారు. మండలాధికారులు, ప్రజాప్రతినిధులు తప్పక హాజరుకావాలని కోరారు.

1న మండల సర్వసభ్య సమావేశం

సీతారామపురం: మండల పరిషత్ సర్వసభ్య సమావేశాన్ని జూన్ 1న నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ అబ్దుల్‌కలాంఆజాద్ గురువారం తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి అధ్యక్షతన జరిగే మండల సర్వసభ్య సమావేశంలో విద్య, వ్యవసాయం, తాగునీరు, ఉపాధిహామీ, పంచాయతీరాజ్, గృహనిర్మాణ శాఖలపై సమీక్ష నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలంలోని ప్రజాప్రతినిధులు, అధికారులు హాజరుకావాలని కోరారు.

తప్పిపోయిన వృద్ధుడి మృతి

అనుమసముద్రంపేట: తప్పిపోయిన పోనుగోడుకు చెందిన వృద్ధుడి మృతదేహాన్ని అటవీ ప్రాంతంలో గురువారం గుర్తించారు. వివరాలు.. పోనుగోడుకు చెందిన మల్లే రమణయ్య ఈ నెల 6న పెన్షన్ ఏ బ్యాంకులో పడిందో తెలుసుకునేందుకు సచివాలయం వద్దకు వెళ్లాడు. అక్కడి నుంచి తిరిగి వచ్చే క్రమంలో దారితప్పి అటవీ ప్రాంతంలోకి వెళ్లిపోయాడు. ఇంటికి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. అప్పటి నుంచి కుటుంబ సభ్యులు ఎంత వెతికినా ప్రయోజనం లేకుండా పోయింది. గురువారం రాజవోలు అటవీ ప్రాంతంలో మృతదేహాన్ని గుర్తించిన మేకల కాపరులు గ్రామస్తులకు తెలియజేశారు. దీంతో గ్రామస్తులందరూ అటవీ ప్రాంతానికి వెళ్లి చూసి రమణయ్య మృతదేహంగా గుర్తించారు. ఈ విషయాన్ని పోలీసులకు తెలియజేయగా ఘటనా స్థలానికి చేరుకుని రమణయ్యదిగా నిర్ధారించుకుని అక్కడే పోస్టుమార్టం నిర్వహించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై ప్రసాద్ రెడ్డి తెలిపారు.

మర్యాదపూర్వకంగా..



ఉదయగిరి: మర్రిపాడు మండలం బ్రాహ్మణపల్లిలోని నివాసంలో వైఎస్సార్‌సీపీ ఉదయగిరి ఎమ్మెల్యే అభ్యర్థి మేకపాటి రాజగోపాల్‌రెడ్డిని ఉదయగిరి ఉపసర్పంచ్ ముర్తుజాహుస్సేన్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఉదయగిరిలోని తాజా రాజకీయ పరిస్థితులు, ఈ నెల 13న జరిగిన పోలింగ్ సరళి, మండలంలో వైఎస్సార్‌సీపీకి వచ్చే మెజార్టీ, తదితర అంశాలను చర్చించారు. మండలంలో ఐదు వేల వరకు మెజార్టీ వస్తుందని మేకపాటికి వారు వివరించారు.

భూసార పరిరక్షణపై అవగాహన



ఏఎస్‌పేటలో..



కావలి: అవగాహన కల్పిస్తున్న సత్యవాణి

కావలి: మండలంలోని తాళ్లపాళెంలో భూసార పరిరక్షణపై రైతులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారిణి పీ సత్యవాణి పాల్గొని మాట్లాడారు. ప్రధానమంత్రి ప్రణామ్ భూసార పరిరక్షణ కార్యక్రమంలో భాగంగా రైతులకు భూసార పరిరక్షణపై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. విచ్చల విడిగా రసాయన ఎరువులను వినియోగించడం వల్ల భూమి స్వభావం దెబ్బతింటుందన్నారు. భూమి నిస్సారంగా మారి పంట దిగుబడులు తగ్గుతాయని తెలిపారు. మరోవైపు ఎరువుల పెట్టుబడులు పెరిగి రైతులు నష్టపోతున్నారని వివరించారు. వాటికి ప్రత్యామ్నాయంగా పచ్చిరొట్ట పైర్లను సాగుచేయడం వల్ల భూమిలోని కర్బన శాతం పెరిగి పంట దిగుబడులు బాగా వస్తాయని తెలిపారు. రసాయన ఎరువులు, పురుగు మందులను నిషేధించి ప్రకృతి వ్యవసాయంపై రైతులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏడీలు నర్సోజీరావు, నాగరాజు, ఏఓ లలిత, వీపీఏలు, రైతులు పాల్గొన్నారు.

అనుమసముద్రంపేట: మండలంలోని జమ్మవరం, గుంపర్లపాడు గ్రామాల్లో భూసార పరిరక్షణపై రైతులకు అవగాహన సదస్సులు నిర్వహించారు. వ్యవసాయశాఖ అధికారి లక్ష్మీమాధవి రైతులకు భూసార పరిరక్షణపై అవగాహన కల్పించారు. ఆత్మకూరు ఏడీఏ దేవసేనమ్మ, ఏఎస్‌పేట ఏఓ రజని, ఏఈఓ చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేకావసరాల పిల్లల గుర్తింపునకు సర్వే



సర్వే నిర్వహిస్తున్న ఐఆర్పీలు

ఉదయగిరి: మండలంలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రత్యేకావసరాలు కలిగిన విద్యార్థుల గుర్తింపునకు సర్వేను భవిత కేంద్ర ఐఆర్పీలు శివనందిని, సుభాస్ చంద్రబోస్ గురువారం నిర్వహించారు. సమగ్ర శిక్ష ఏపీడీ ఉషారాణి ఆదేశాల మేరకు సచివాలయాల పరిధిలో సర్వే నిర్వహిస్తున్నామని వారు తెలిపారు. సర్వేలో గుర్తించిన విద్యార్థులకు భవిత కేంద్రాల్లో ప్రవేశం కల్పిస్తామన్నారు. భవితా కేంద్రానికి వచ్చే విద్యార్థులకు ట్రాన్స్‌పోర్టు అలవెన్స్, బాలికలకు స్టయిఫండ్, నడవలేని విద్యార్థులకు ఎస్కార్ట్ అలవెన్స్ అందజేస్తామని చెప్పారు. అవసరమైన విద్యార్థులకు ఉపకరణాలు అందజేస్తామని తెలిపారు. మంచానికే పరిమితమైన దివ్యాంగ విద్యార్థులకు ప్రతి శనివారం ఇంటివద్దే విద్యను అందించడంతో పాటు హోమ్ అలవెన్స్‌లు ఇవ్వనున్నట్లు వివరించారు.

ముమ్మరంగా బీసీజీ వ్యాక్సినేషన్



ఆదూరుపల్లి సచివాలయంలో..



ఉదయగిరి: వ్యాక్సినేషన్‌ను పరిశీలిస్తున్న వైద్యాధికారిణి శివకల్పన

ఉదయగిరి: పట్టణంలోని ఇందిరానగర్ కాలనీ ప్రాంతంలో అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని గండిపాళెం పీహెచ్‌సీ వైద్యాధికారిణి ఎం శివకల్పన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ క్షయ వ్యాధి సోకకుండా ముందస్తుగా పెద్దలకు బీసీజీ వ్యాక్సిన్ వేస్తున్నట్లు తెలిపారు. ఐదేళ్ల క్రితం క్షయ వ్యాధి సోకి తగ్గిన రోగులు, వారి కుటుంబ సభ్యులు, దగ్గర సంబంధాలు ఉన్న, పొగతాగే, మధుమేహం ఉన్న, బీఎంఐ 18 కన్నా తక్కువ ఉన్న వారికి ప్రతి గురువారం ఉచితంగా టీకాలు వేస్తున్నామని వివరించారు.

చేజర్ల: చిత్తలూరు పీహెచ్‌సీ పరిధిలోని ఆదూరుపల్లి, ఏటూరు గ్రామాల్లో ఎంపిక చేసిన వయోజనులకు వైద్యారోగ్య సిబ్బంది బీసీజీ వ్యాక్సిన్లు వేశారు. జిల్లాను క్షయ రహితంగా మార్చేందుకు 18 ఏళ్లు నిండిన వారికి వ్యాక్సిన్లు వేస్తున్నట్లు వారు తెలిపారు. సీహెచ్‌ఓ మంజుల, సూపర్‌వైజర్ జీ లక్ష్మమ్మ, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

మండలానికి చేరిన పాఠ్యపుస్తకాలు



సోమశిల: అనంతసాగరం మండలానికి పాఠ్యపుస్తకాలు గురువారం చేరాయి. వీటిని అనంతసాగరంలోని జెడ్పీ హైస్కూల్‌లో భద్రపరిచారు. మండలంలోని ఉన్నత పాఠశాలల్లో 8,9,10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు సంబంధించి పాఠ్యపుస్తకాలతో పాటు నోట్ పుస్తకాలు వచ్చినట్లు ఎంఈఓ బాలకృష్ణారెడ్డి తెలిపారు. ఎంఈఓ–2 కాంటరెడ్డి ప్రభాకర్ రెడ్డి, హెచ్‌ఎం లక్ష్మీప్రసన్న పరిశీలించారు.

ఇంటర్ పరీక్షలకు ఏర్పాట్లు పూర్తి

ఉదయగిరి: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం నుంచి 30వ తేదీ వరకు జరగనున్న ఇంటర్మీడియట్ సప్లిమెంటరీ పరీక్షలకు అన్ని ఏర్పాట్లు పూర్తిచేసినట్లు పరీక్ష కేంద్ర చీఫ్ సూపరింటెండెంట్ ఎం వాసుబాబు గురువారం విలేకరులకు తెలిపారు. ఉదయం ప్రథమ, మధ్యాహ్నం ద్వితీయ సంవత్సరం పరీక్షలు జరుగుతాయని చెప్పారు. 144 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్లు చెప్పారు. మొత్తం ఐదు గదులను కేటాయించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేశామని తెలిపారు. నిఘా నీడలో పరీక్షలు జరుపుతున్నామని వివరించారు. విద్యార్థులు గంట ముందుగా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని సూచించారు.

కోడిపందేల స్థావరంపై దాడులు

వరికుంటపాడు: మండలంలోని విరువూరు శివారు ప్రాంతంలో నిర్వహిస్తున్న కోడిపందేల స్థావరంపై ఎస్సై తిరుపతయ్య తన సిబ్బందితో కలిసి గురువారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 20 బైకులు, తొమ్మిది కోళ్లు, రూ.5,700 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి కోర్టుకు హాజరుపర్చనున్నట్లు ఎస్సై తెలిపారు.

వ్యక్తి మృతి

కొండాపురం: పూటుగా మద్యం సేవించి వ్యక్తి మృతి చెందిన ఘటన మండలంలోని కొమ్మిపాలాల్లో గురువారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన బీ ఏడుకొండలు(38) గత కొన్ని సంవత్సరాలుగా మద్యానికి బానిసై విపరీతంగా తాగుతున్నాడు. ఈ నేపథ్యంలో గురువారం మద్యం సేవించి పంట పొలాల్లోకి వెళ్లి పడుకుని మృతి చెందినట్లు గ్రామస్తులు తెలిపారు. మృతుడికి భార్య, పిల్లలున్నారు. ఈ విషయమై పోలీసులకు ఎలాంటి ఫిర్యాదు అందలేదు.

కనులపండువగా సీతారాముల కల్యాణం



కలిగిరి: సీతారాముల కల్యాణోత్సవం



చేజర్ల: కొట్టాలులో గజ వాహనంపై సీతారాములు

కలిగిరి: మండలంలోని కృష్ణారెడ్డిపాళెం, తూర్పుదూబగుంట గ్రామాల్లో కోదండరామస్వామి ఉత్సవాల్లో భాగంగా గురువారం సీతారాముల కల్యాణాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. సీతారాముల ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు.

చేజర్ల: మండలంలోని కొట్టాలులో కోదండరామస్వామి ఉత్సవాల్లో భాగంగా నాల్గో రోజు గురువారం సీతారాముల కల్యాణోత్సవాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం గజ వాహనంపై సీతారాములను కొలువుదీర్చి ఊరేగించారు.

ముగిసిన సీతారాముల ఉత్సవాలు



ఉదయగిరి: పప్పులవారిపల్లెలో పార్వేట

ఉదయగిరి: మండలంలోని ఆర్లపడియ పంచాయతీ పప్పులవారిపల్లెలో మూడ్రోజులుగా జరుగుతున్న కోదండరామస్వామి ఉత్సవాలు గురువారంతో ముగిశాయి. ఆలయ అర్చకులు ఎల్‌వీ ప్రసాద్‌శర్మ సీతారాముల ఉత్సవ విగ్రహాలకు విశేష పూజలు నిర్వహించి వసంతోత్సవం నిర్వహించారు. అనంతరం సీతారాముల పార్వేట కార్యక్రమాన్ని వేడుకగా నిర్వహించారు. లంకా దహనంతో ఉత్సవాలకు ముగింపు పలికారు.

వైభవంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం



సోమశిలలో...



ఆత్మకూరులో విశేషాలంకారంలో లక్ష్మీనరసింహస్వామి

సోమశిల: నృసింహ జయంతిని పురస్కరించుకుని అనంతసాగరం మండలం ఉప్పలపాడులోని లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో గురువారం స్వామి వారి కల్యాణ మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం చేశారు. ఉభయకర్తలుగా ఊరుబిండి ప్రభాకర్‌రెడ్డి, ప్రశాంతమ్మ, చేతన్, గ్రామస్తులు వ్యవహరించారు.

ఆత్మకూరు: నృసింహ జయంతి సందర్భంగా మున్సిపల్ పరిధిలోని తిరునాళ్లతిప్ప వద్ద ఉన్న పెంచల లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మూడు రోజులుగా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా గురువారం శ్రీవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. నరసింహస్వామి, చెంచులక్ష్మీదేవి ఉత్సవమూర్తులను విశేషంగా అలంకరించి శాస్త్రోక్తంగా కల్యాణం జరిపారు.

200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకమే లక్ష్యం



మాట్లాడుతున్న ఏపీడీ గాయత్రీదేవి

ఉదయగిరి: 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో 200 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకం చేపట్టాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు ఉపాధి హామీ పథకం ఉదయగిరి క్లస్టర్ ఏపీడీ గాయత్రీదేవి తెలిపారు. స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బందితో గురువారం ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పండ్ల తోటల పెంపకానికి క్షేత్ర స్థాయిలో ఈసీ, ఏపీఓ, ఎఫ్ఏలు ప్రణాళికలు రూపొందించాలన్నారు. గ్రామాల్లో ఎస్సీ, ఎస్టీలకు ఉపాధి పనులు కల్పించాలన్నారు. ఉపాధి కూలీల హాజరును పెంచాలన్నారు. వేసవి దృష్ట్యా ప్రభుత్వం నిర్దేశించిన రూ.300 గిట్టుబాటు కూలి అందేలా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ డీ ఈశ్వరమ్మ, ఏపీఓ బీ శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు



చేజర్ల: మాట్లాడుతున్న ఎస్సై ప్రభాకర్



ఉదయగిరి: శాంతిభద్రతలపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

వింజమూరు(ఉదయగిరి):ఎన్నికల కౌంటింగ్ ముగిసే వరకు కోడ్ అమల్లో ఉన్నందున ఎవరైనా శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ కృష్ణారెడ్డి, ఎస్సై కోటిరెడ్డి హెచ్చరించారు. ఈ నెల 13న సార్వత్రిక ఎన్నికల సందర్భంగా మండలంలోని బత్తినవారిపల్లిలో ఇరువర్గాల మధ్య ఘర్షణలు చోటు చేసుకున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో గ్రామంలో గురువారం వారు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంపై ప్రత్యేక నిఘా ఉంచామని తెలిపారు. ఎలాంటి గొడవలు లేకుండా సామరస్యంగా ఉండాలని సూచించారు. ఎవరైనా గ్రామంలో గొడవలు, అల్లర్లు సృష్టించాలని ప్రయత్నిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. అనంతరం టీడీపీ, వైఎస్సార్‌సీపీ నాయకులను బైండోవర్ చేసుకున్నారు.

చేజర్ల: కౌంటింగ్ రోజున ప్రశాంత వాతావరణానికి రాజకీయ పార్టీల నాయకులు, ప్రజలు సహకరించాలని చేజర్ల ఎస్సై ప్రభాకర్ కోరారు. మండల తహసీల్దార్ కార్యాలయంలో అధికారులు, బీఎల్వోలు, పంచాయతీ కార్యదర్శులతో గురువారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కౌంటింగ్ రోజున రాజకీయ పార్టీల నాయకులు ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయరాదన్నారు. పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉన్నందున ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదన్నారు. ఎవరైనా అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ సమావేశంలో తహసీల్దార్ గోపీకృష్ణ, ఎంపీడీఓ ఎస్ కరిముల్లా, తదితరులు పాల్గొన్నారు.

సంగం: సంగం సర్కిల్ పరిధిలో కౌంటింగ్ రోజు వరకు పోలీస్ యాక్ట్ 30 అమల్లో ఉంటుందని సంగం సీఐ రవినాయక్ తెలిపారు. గురువారం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ఎవరైనా చట్టాన్ని అతిక్రమిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. కౌంటింగ్ రోజున ర్యాలీలు, సభలు, సమావేశాలకు అనుమతి లేదన్నారు. బాణసంచా కాల్చిన విక్రయించిన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు. సెక్షన్ 144 అమల్లో ఉన్నందున నాయకులు, ప్రజలు పోలీసులకు సహకరించాలని కోరారు.

దారిని ఆక్రమించి ప్రహరీ నిర్మాణంపై ఫిర్యాదు

సీతారామపురం: మండలంలోని సంజీవరెడ్డినగర్‌లో అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లే దారిని ఆక్రమించి ప్రహరీని నిర్మించడంపై యాక్టింగ్ సూపర్‌వైజర్ రత్తమ్మ, అంగన్‌వాడీ కార్యకర్త మహాలక్ష్మి తహసీల్దార్, ఎంపీడీఓలకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 16 ఏళ్ల నుంచి ఎంఈఓ అనుమతితో గ్రామంలోని ఎంపీయూపీ స్కూల్‌లో అంగన్‌వాడీ కేంద్రం నడుపుతున్నామని తెలిపారు. ప్రస్తుతం గ్రామానికి చెందిన రమణమ్మ, బాలవెంకటనారాయణ, గోవిందమ్మ స్కూల్ లోపలికి వెళ్లేందుకు లేకుండా అడ్డంగా ప్రహరీని నిర్మించారని, ప్రశ్నించిన తమపై దౌర్జన్యానికి పాల్పడుతున్నారని ఆరోపించారు. అంగన్‌వాడీ కేంద్రం నేషనల్ హైవేను ఆనుకుని ఉన్నందున చిన్నారులు, లబ్ధిదారులు కేంద్రంలోకి రావాలంటే తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. అధికార యంత్రాంగం స్పందించి అంగన్‌వాడీ కేంద్రంలోకి వచ్చేందుకు దారి వసతి కల్పించాలని కోరారు. అందుకు స్పందించిన అధికారులు క్షేత్రస్థాయిలో విచారణ జరిపి సమస్యకు పరిష్కారం చూపుతామని హామీ ఇచ్చారు.

27 నుంచి పాలిటెక్నిక్ కౌన్సెలింగ్

కావలి: 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి పాలిటెక్నిక్ ప్రవేశాలకు ప్రభుత్వం షెడ్యూల్‌ను విడుదల చేసిందని రుద్రకోట పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఏ సుశీల్‌కుమార్ ప్రియ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు.ఈ నెల 27 నుంచి జూన్ 3 వరకు కౌన్సెలింగ్ ప్రక్రియ ఉంటుందని చెప్పారు. కౌన్సెలింగ్‌కు హాజరయ్యే విద్యార్థులు ఈ నెల 24 నుంచి జూన్ 2లోగా ఫీజు చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఈ నెల 31 నుంచి జూన్ 5వ తేదీ వరకు ఆప్షన్ల నమోదుకు అవకాశం కల్పించినట్లు తెలిపారు. 7న సీట్లు కేటాయింపు ఉంటుందని తెలిపారు. 10 వ తేదీలోగా విద్యార్థులు ఆన్‌లైన్ విధానంలో సెల్ఫ్‌జాయినింగ్ అయి కళాశాలలో రిపోర్టు చేసుకోవాల్సి ఉంటుందని చెప్పారు. జూన్ 10 నుంచి తరగతులు ప్రారంభమవుతాయని తెలిపారు. వివరాలకు 99490 22772, 94407 07944 నంబర్లను సంప్రదించాలని సూచించారు.